WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

# నవతరం

తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ , రాజమండ్రి | సంపుటి : 12 | సంచిక : 340 బుధవారం 22 -4-2026 | పేజీలు : 4 | వెల : 5-00

## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రైవేట్ పరం చేసే యత్నాలను అడ్డుకుంటాం
- ప్రజలు సమస్యల్లో ఉంటే సభలతో కాలయాపనా
- 25న రాజకీయ శక్తిగా ముందుకు రాబోతున్నాం
- జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడి



హైదరాబాద్‌నవతరం
ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులంటే లెక్కలేనితనంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని కవిత మండిపడ్డారు. ఆర్‌టిసిలో కార్మికులు లేకుండా చేసి సంస్థను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు.

మిగతా 2లో

## ఔను ..లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా



- కెసిఆర్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసు
- హుందాగా మాట్లాడడం నేర్చుకుంటే మంచిది
- కావాలనే కెసిఆర్ సభరోజు సభ పెట్టారు
- కురచ బుద్ధి చాటుకున్న రేవంత్ రెడ్డి

## అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్

పదేళ్లలో అబద్ధాలతోనే పాలన చేశారు

బిఆర్ఎస్‌లో ఇప్పుడు పంపకాల పంచాయితీ

రబీ ధాన్యంసేకరణపై అధికారులతో కోమటిరెడ్డి సమీక్ష



నల్గొండ, **నవతరం**
అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్‌ను మించినోళ్లు లేరని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు చేశారు. కేసీఆర్ గతంలో దళితుడిని సీఎం చేస్తాం.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి ఉన్న పదేండ్లలో హామీలు అమలు చేయలేదని విమర్శించారు. అబద్దాలు చెప్పి మోసం చేయడం కెసిఆర్ నైజం అని మంత్రి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడో విచ్ఛిన్నమైందని.. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీలో పంపకాల కోసం అధిపత్య పోరు జరుగుతుందన్నారు. ఫ్యామిలీ టెన్షన్స్‌తో కేసీఆర్ ఫ్రస్టేషన్లో ఉన్నారని.. అందుకే జగిత్యాల సభలో నోటికి వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. కేసీఆర్ ఫస్ట్ ఆయన ఇల్లు చక్కదిద్దు కోవాలని ఆ తర్వాత పార్టీ పునర్నిర్మాణం గురించి ఆలోచించాలని సూచించారు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ లీడర్ బీఆర్ఎస్ పార్టీలో చేరడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు.

2039 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. జగిత్యాలలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వ హించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని

మిగతా 2లో

## ఇథనాల్ వాడకంపై దృష్టి సారించాలి

ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాలి

కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ




2లో



# 27న బిఆర్ఎస్ భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం

### తెలంగాణ భవన్‌లోనే సమావేశాలు

### తాజా రాజకీయ పరిణాలపై చర్చించే ఛాన్

హైదరాబాద్,**నవతరం** భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవం, రజతోత్సవాల ముగింపు కార్యక్రమాలకు సిద్ధం అవుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 27వ తేదీన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కీలక సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు పార్టీ హైకమాండ్ భారీ ఏర్పాట్లు చేస్తోంది. 27వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో రజతోత్సవ సంబరాల ముగింపు సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.



## తమిళనాడు ప్రచారంలో ఖర్గే వివాదదాస్పద వ్యాఖ్యలు

- మోడీని టెర్రరిస్ట్ అంటూ ఎత్తిపొడుపు
- ఖర్గే వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేతలు
- అలా అనలేని మళ్లీ వివరణ ఇచ్చిన ఖర్గే



2లో

## భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ



- భూభారతి పోర్టల్‌తో భూమి హక్కులకు శాశ్వత భరోసా
- కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

2లో



## రోగులకు మెరుగైన వైద్యం

- మచిలీపట్నంలో ఆస్పత్రిలో మంత్రి తనిఖీలు
- పారిశుద్ధ్యం, పార్కింగ్ వ్యవస్థల మెరుగుకు ఆదేశం
- మంత్రి కొల్లు రవీంద్ర

2లో

# ఘనంగా సింహాద్రి అప్పన్నస్వామి చందనోత్సవం



విశాఖపట్టణం,ఏప్రిల్20 సింహాద్రి అప్పన్నస్వామి చందనోత్సవం ఘనంగా జరుగుతోంది. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు కుటుంబం స్వామివారికి తొలి చందన సమర్పణ చేసి దర్శనం చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హోం మంత్రి అనిత స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం తితిదే దేవస్థానం స్వామికి పట్టువస్త్రాలు సమర్పించింది. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి నిజరూప దర్శనానికి లక్షల మంది భక్తులు తరలిరానుండటంతో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు అయితే సింహాచలం

చందనోత్సవంలో భక్తుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. సింహాచలం అప్పన్నస్వామి చందనోత్సవానికి భక్తులు భారీగా తరలిరావడంతో కొంద ఇబ్బంది ఏర్పడింది. దాంతో భక్తులు గంటల తరబడి సింహాచలం బస్టాండ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. బస్టాండ్‌లో సైతం భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో పోలీసులు వారిని కంట్రోల్ చేయలేకపోయారు. బస్టాండ్‌కు నుంచి సింహాచలం కొండపైకి వెళ్లే బస్సుల్లో భక్తులు కిక్కిరిసి పోయారు. బస్సులు ఎక్కడానికి ఎగబడిపోయారు. సరైన ఏర్పాట్లు చేయకపోవడంత భక్తుల అవస్థలు తప్పడం లేదు. గంటల తరబడి క్యూలైన్లలోనే ఉంటున్నామని, కనీస సౌకర్యాలు కూడా ఏర్పాట్లు చేయలేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అధికారంలోకి రాగానే హైడ్రాను ఎత్తేస్తాం

బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి రోజుల్లోనే హైడ్రాను ఎత్తి అవతల పడేస్తామని హామీ ఇచ్చారు. మొదటి సంతకంతోనే హైడ్రాను తీసి చెరువులో పడేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 46వేల చెరువులు మంచిగా చేశామని.. కానీ ఒక్క గుడిసె కూడా కూలగొట్టలేదని స్పష్టం చేశారు. మూసీ అని గరీబోళ్లను ఏడిపిస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. పొద్దున లేస్తే నిద్రపోకుండా, వారి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 వేల ఇళ్లు కూలగొడతామని అంటున్నారని.. అది ధర్మమేనా అని ప్రశ్నించారు. మూసీని మంచిగ చేయాల్సిందేనని.. కానీ ఇళ్లు కూలగొట్టుడు ఎందుకని నిలదీశారు. భూములు కబ్జా పెట్టే రియల్ ఎస్టేట్ దందా తప్ప అందులో ఏమీ లేదని అన్నారు. ఈజీగా చేయగలిగిన దాన్ని నాశనం పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఏది చూసినా కూడా ఒకరకమైన దోపిడీ, ఒకరకమైన గుండాగిరి, అరాచకంతో ముందుకెళ్తున్నారే తప్ప.. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి ఒక్క స్కీమ్ కూడా తీసుకురాలేదని మండిపడ్డారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను పండబెట్టింద్రని.. ఏం రోగమని కేసీఆర్ ప్రశ్నించారు.

## కూటమి పాలనలో తిరుమల పవిత్రతకు గ్రహణం

తిరుపతి,కలియుగ వైకుంఠం తిరుమలలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుస అపచారాలు చోటుచేసుకుంటున్నాయని వైయస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతిలోని తన నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొండపై అవినీతి పరాకాష్టకు చేరిందని ధ్వజమెత్తారు. అత్యంత పవిత్రమైన 'నాదనీరాజనం' వేదికను కమిషన్ల దందాకు అడ్డాగా మార్చారని, కళాకారుల పారితోషికంలోనూ వాటాలు వసూలు చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. రూ.300 దర్శన టిక్కెట్లను వేల రూపాయలకు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తూ సామాన్య భక్తులను నిలువునా దోచుకుంటున్నారని ఆరోపించారు. ఎస్వీబీసీ ఛానెల్‌ను నిర్వీర్యం చేస్తూ, వేద పండితులను అవమానిస్తున్న కూటమి పాలకులకు భగవంతుడి ఆగ్రహం తప్పదని భూమన హెచ్చరించారు.సాంస్కృతిక వైభవాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి దివంగత నేత వైయస్సార్ హయాంలో ప్రారంభించిన 'నాదనీరాజనం' వేదిక నేడు అవినీతికి నిలయంగా మారింది.

## దక్షిణ కొరియా ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం



అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో ఇది కీలక ముందడుగు అని అన్నారు. భారత్, దక్షిణ కొరియా మధ్య సంబంధాలు కేవలం వాణిజ్యానికి మాత్రమే పరిమితం కాకుండా టెక్నాలజీ, రక్షణ, షిప్ బిల్డింగ్, ఎనర్జీ వంటి విభిన్న రంగాల్లో విస్తరిస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. చిప్స్ నుంచి షిప్స్ వరకు, ట్యాలెంట్ నుంచి టెక్నాలజీ వరకు, ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి ఎనర్జీ వరకు.. ఇలా వివిధ రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సుమారు 27 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యాన్ని 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక ఒప్పందాలు కూడా కుదిరాయి. ముఖ్యంగా పారిశ్రామిక రంగం, టెక్నాలజీ, ఎనర్జీ, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో పరస్పరం సహకరించుకునేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. అలాగే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం రెండు దేశాలు కలిసి పనిచేస్తాయని మోదీ తెలిపారు.

# మళ్లీ తెలంగాణ నాటి ఉద్యమ పరిస్థితులు



పని కూడా కాంగ్రెస్ చేపట్టలేదన్నారు. ఉద్యమనాటి పరిస్థితులు మళ్లీ దాపరించాయని, ఎరువుల బస్తాలకు మళ్లీ క్యూలో చెప్పులు పెట్టాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. కరెంట్ ఆగం అయ్యిందని, మిషన్ బగీరథ మూలన పడిందన్నారు. పెట్టిన ఇల్లులాగా ఉన్న తెలంగాణను అప్పగి÷-తే సర్వనాశనం చేశారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి పేరు ఎక్కడా ఎత్తకుండా కాంగ్రెస్ పాలనపై ధ్వజమెత్తారు. తెలంగాణ రాకముందు ఈ ప్రాంతంలో భయంకర పరిస్థితులు ఉండేవని కెసిఆర్ వ్యాఖ్యానించారు. గతంలో తెలంగాణ పదం పలకడానికే భయపడే రోజులు ఉండేవని పేర్కొన్నారు. భిన్న రాజకీయ పార్టీల వల్లే జీవన్‌రెడ్డి, తాము వేర్వేరుగా పనిచేశామని అన్నారు. జీవన్‌రెడ్డి గుండెధైర్యంతో నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.జీవన్‌రెడ్డిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని వెల్లడించారు. ఆయన ప్రజాజీవితం ఎంతోమందికి ఆదర్శమని ప్రశంసించారు. జీవన్‌రెడ్డి చేరికతో బీఆర్ఎస్‌కు ఊపు వస్తోందన్నారు.జీవన్‌రెడ్డితో కలిసి అన్నదమ్ముల్లా పనిచేస్తామని వివరించారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా జీవన్‌రెడ్డికి తక్షణ బాధ్యతలు ఇస్తామని స్పష్టం చేశారు. కరీంనగరే కాదని.. చుట్టుపక్కల జిల్లాల్లోనూ జీవన్‌రెడ్డి పనిచేయాలని సూచించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవన్‌రెడ్డి కీలక బాధ్యతల్లో ఉంటారని పేర్కొన్నారు. తెలంగాణ పదాన్నే నిషేధించే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. మన నీళ్లు, వనరులను దోపిడీ చేశారని ధ్వజమెత్తారు.

కొన్ని పార్టీల తీరుతో ఆవేశం, దు:ఖం వచ్చేదని చెప్పుకొచ్చారు. పాలమూరు లాంటి జిల్లాల్లో 90 శాతం వలసలే ఉన్నాయని ప్రస్తావించారు. గంజి కేంద్రాలు పెట్టిన అధ్వాన స్థితికి తెలంగాణను చేర్చారని తెలిపారు. కరెంట్ లేదు.. నీళ్లు లేవు.. దారుణ పరిస్థితులు ఉండేవని అన్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు చంద్రబాబు కరెంట్ ఛార్జీలు పెంచారని చెప్పారు. కరెంట్ ఛార్జీలపై నిరసన తెలిపితే బషీర్‌బాగ్‌లో కాల్చి చంపారని విమర్శించారు. బషీర్‌బాగ్ ఘటనతోనే తెలంగాణ జెండా పట్టుకుని ఉద్యమం చేశానని ప్రస్తావించారు. బక్కపలచనోడు, ఇతనితో ఏమవుతుందని హేళన చేశారని గుర్తుచేశారు.

మొక్కవోని దీక్షతో తెలంగాణ మొత్తం తిరిగి ఉద్యమించానని ఉద్ఘాటించారు. మాజీ సీఎం రోశయ్య 14ఈ జీవో తెస్తే ఉద్యోగ గర్జన చేపట్టామని ప్రస్తావించారు.

తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అంటూ దీక్ష చేపట్టానని తెలిపారు.

## కల్వకుంట్ల కుటుంబానికి కాలం చెల్లింది



తిరస్కరించారో, 2029 ఎన్నికల్లోనూ అదే ఫలితం పునరావృతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద ప్రాజెక్టులు కట్టి రైతులకు నీరిచ్చింది కాంగ్రెస్ పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర ఇచ్చే చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ప్రజాపాలనలో రైతు ఉత్సవాల పేరుతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూర్‌పల్లిలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో సీఎం పాల్గొన్నారు. సభావేదిక పైనుంచి రెండోవిడత రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన తొలిపార్టీ కాంగ్రెస్ అని అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి ఏడాదిలోపే చేసి చూపించాం. 25.35 లక్షల మంది రైతుల ఖాతాల్లో రుణమాఫీ కింద రూ.22 వేల కోట్లు వేశాం. గత విడతలో రైతుభరోసా కింద 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు వేశాం. ఇవాళ రెండో విడతగా రూ.5,700 కోట్లకుపైగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. మిగతా రూ.3,300 కోట్లు వచ్చే నెలలో రైతుల ఖాతాల్లో వేస్తాం. రాష్ట్రంలో 3.5 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం ఇస్తున్నాం. పేదలకు సన్న బియ్యం ఇవ్వాలనే ఆలోచన గతంలో ఎవరికైనా వచ్చిందా? అన్నారు. గతంలో వైఎస్ఆర్- డి.శ్రీనివాస్ జోడీ కాంగ్రెస్‌ను వరుసగా ఎలా గెలిపించిందో, ఇప్పుడు తాను, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కలిసి రెండోసారి కాంగ్రెస్‌ను విజయతీరాలకు చేరుస్తామని ఆయన శపథం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం అని, వారిచ్చిన తీర్పును గౌరవించకుండా కేసీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడటం ఆయన భ్రమలకు నిదర్శనమని రేవంత్ మండిపడ్డారు.

## విజయ్-సంగీతలో విడాకుల వ్యవహారం

చెన్నై,ఏప్రిల్20 కోలీవుడ్ స్టార్ హీరో, టీవీకే అధినేత విజయ్ వ్యక్తిగత జీవితం హాట్ టాపిక్ గా మారింది. ఒక వైపు రాజకీయంగా ప్రత్యర్థుల నుంచి విమర్శలు, మరోవైపు వైవాహిక బంధంలో ఒడిదుడుకులు ఇప్పుడు దళపతినిఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. విజయ్ భార్య సంగీత దాఖలు చేసిన విడాకుల పిటిషన్ పై చెంగల్పట్టు కోర్టు విచారణను జూన్ 15కు వాయిదా వేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల హీట్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిమాణాలు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే విజయ్ - సంగీత జంట పరస్పర అంగీకారంతో విడిపోయేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం చైన్నైలో ఇరువురి లాయర్లు కలిసి చర్చించినట్లు సమాచారం. విడిపోయేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అయితే సెటిల్ మెంట్ కింద ఎన్నికల అఫిడవిట్ లో ప్రకటించిన ఆస్తుల ఆధారంగా , తన ఇద్దరు పిల్లలు భవిష్యత్తు కోసం సుమారు రూ. 250 కోట్లు భరణం సంగీత కోరినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే విజయ్ మాత్రం సంగీతకు రూ. 35 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని సమచారం. కుమారుడు, కుమార్తె బాగోగులు తాను చూసుకుంటానని విజయ్ అన్నట్లు తెలుస్తోంది. అయితే విడాకుల వ్యవహారం కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోదని సమాచారం.

విజయ్ నుంచి విడాకుల కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో సంగీత పిటిషన్ దాఖలు చేశారు. అందులో ఆమె పేర్కొన్న అంశాలు కోలీవుడ్‌లో కలకలం రేపుతున్నాయి. విజయ్ ఒక నటితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపించారు. తనను మానసిక, శారీరక వేధింపులకు గురిచేశారని, కనీస ఆర్థిక స్వేచ్ఛ కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. తన సొంత పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ద్వారా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన విజయ్‌కు ఈ ఎన్నికలు అత్యంత కీలకం. అయితే, సరిగ్గా ఎన్నికల ప్రచార సమయంలో ఈ విడాకుల వ్యవహారం తెరపైకి రావడం ఆయనకు ప్రతికూలంగా మారుతుందా అన్న చర్చ సాగుతోంది.

## అన్న వితరణకు వేదికగా అన్నక్యాంటీన్లు



అమరావతి,సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అన్నదానం అన్నిటికంటే పవిత్రమైందని, ఇందులో ఎవరికి తోచిన విధంగా వారు భాగస్వాములు కావొచ్చని తెలిపారు. తన పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి విజయవాడలోని పటమట అన్నక్యాంటీన్‌కు ఆయన సతీమణి భువనేశ్వరితో కలిసి వెళ్లారు. క్యాంటీన్‌కు అల్పాహారం నిమిత్తం వచ్చేవారికి స్వయంగా ఇరువురు వడ్డించారు. అనంతరం సీఎం చంద్రబాబు, భువనేశ్వరి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ అన్నవితరణకు శక్తి మేరకు ఎవరైనా విరాళాలు ఇవ్వొచ్చు. అన్నదానంలో అందరూ భాగస్వాముల కావాలని పిలుపునిస్తున్నా. ఎవర్నీ బలవంతం చేయడం లేదు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆకలితో బాధపడకూడదు. ఆంధ్రప్రదేశ్ అంటేనే అన్నపూర్ణ. దేశానికి అన్నంపెట్టిన రాష్ట్రం మన ఏపీ. అన్న క్యాంటీన్లలో పేదల ఆనందం చూస్తే చాలా సంతృప్తిని ఇచ్చింది. పటమట అన్న క్యాంటీన్ చాలా పరిశుభ్రంగా ఉంది. పేదలు 3 పూటలా భోజనం చేసే అవకాశం క్యాంటీన్లలో లభిస్తోంది. రూ.5 లకే మంచి ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఆటో డ్రైవర్లు, ముఠా కార్మికులు, పేదలు బయట భోజనం చేయాలంటే రూ.100 చెల్లించాలి.

అక్షయపాత్ర ఫౌండేషన్ సెంట్రలైజ్డ్ కిచెన్‌తో ఆహారం ఎంతో రుచిగా, నాణ్యతతో అన్నక్యాంటీన్లకు సరఫరా చేస్తున్నారని అన్నారు.

## 20 మాసాలుగా కాంగ్రెస్‌లో మానసిక క్షోభ

జగిత్యాల,ఏప్రిల్20 క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఇన్నేళ్లు కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని మాజీ మంతంరి జీవన్ రెడ్డి తెలిపారు. కానీ 20 మాసాలు నా ఉసురుపోసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతకాలం ఈ మానసిక క్షోభ భరించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ బలోపేతానికి నాలుగు దశబ్దాలు పోరాడితే చివరకు దక్కింది ఏంటి.. నా జీవితం చివరి దశలో ఈ మానసిక్ష క్షోభ ఏంటని జీవన్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సమయంలో కేసీఆర్ నాకు చెయ్యిందించి అండగా ఉన్నారని తెలిపారు.జగిత్యాలలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. నా ప్రజా జీవితంలో ఇది ఒక మలుపుగా భావిస్తున్నానని రెడ్డి తెలిపారు. మీ అందరి అండదండలతో ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చూపెట్టిన వివక్షతో బీఆర్ఎస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు.

# జగద్గిరిగుట్ట కోనేరుకు కొత్త కళ తెచ్చిన హైడ్రా


**- ఆక్రమణలతో పాటు పూడికను తొలగించిన హైడ్రా - 22 ఏళ్ల పోరాటం ఫలించిందన్న పూజారి నరహరి**

కుత్బుల్లాపూర్, నవతరం: అనేక దేవాలయాలకు కొలువై ఉన్న జగద్గిరిగుట్ట ఉన్న కోనేరు(గుండం) కబ్జాకు గురౌతోందని.. కాపాడాలని అక్కడి గోవిందరాజుల స్వామి ఆలయ పూజారి నరహరి రోధిస్తూ వేడుకున్న వీడియో అందరికీ గుర్తే ఉంటుంది. సామాజిక మాధ్యమాల్లో ప్రసారమైన వీడియోను చూసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కోనేరు పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన విషయమూ విధితమే. ఈ మేరకు మంగళవారం కోనేరు ఆక్రమణలను హైడ్రా తొలగించింది. అందులో పేరకుపోయిన పూడికను తరలించింది. దాదాపు 26 ట్రక్కుల వరకూ ఉన్న నిర్మాణ వ్యర్థాలు, చెత్త, చెదారాన్ని తొలగించి కోనేరుకు కొత్త కళను అందించింది. ఒక ఎకరా వరకూ ఉన్న కోనేరును ఆక్రమించి మట్టితో నింపి.. పార్కింగ్ కోసం అక్కడి వారు వినియోగించుకుంటున్నారు. ఇలా మొత్తం కోనేరునే కబ్జా చేయాలనుకునే ప్రయత్నాలకు హైడ్రా చెక్ పెట్టింది. ఆ కోనేరు పునరుద్ధరణ కార్యక్రమాన్ని కూడా చేపట్టింది. దీంతో స్థానికులతో పాటు.. ఆలయ భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. కబ్జాలను నియంత్రిచడంలో హైడ్రా చొరవను అభినందించారు.

**22 ఏళ్ల పోరాటం ఫలించింది**

22 ఏళ్ల పోరాటం ఫలించిందని గోవిందరాజుల స్వామి ఆలయ పూజారి నరహరి అన్నారు. కోనేరును చూడకుండానే జీవితం అంతమౌతుందేమో అని ఆందోళన చెందాను.. ఇప్పుడు హైడ్రా రూపంలో ఆ భగవంతుడే.. కోనేరు పరిరక్షణకు చర్యలు తీసుకున్నారు. హైడ్రాను ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి.. కబ్జాలను తొలగించిన హైడ్రా అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, హనుమాన్ దేవాలయం, జగద్గిరిగుట్ట గోవిందరాజుల స్వామి ఆలయం, పోచమ్మ టెంపుల్, శ్రీ వాసవి కనకపరమేశ్వరి ఆలయం, శ్రీ నల్ల పోచమ్మ ఆలయం, శివాలయం, పరశురామాలయం, అయ్యప్పస్వామి ఆలయం ఇలా దేవదేవతలు కొలువైన జగద్గిరిగుట్ట నగర ప్రజలందరికీ సుపరిచితమే. ఇలాంటి చరిత్ర ఉన్న ఆలయ భూములను, కోనేరును కాపాడం ఎంతో శుభ పరిణామమని అన్నారు. వర్షాలు పడినప్పుడు గుట్టపైనుంచి వచ్చే నీరు అందులో చేరుతుందని.. బోర్లు వేసి అయినా నీటితో కోనేరును నింపుతామని పూజారి నరహరి చెప్పారు.









# ఆదాబ్ హైదరాబాద్ కు లీగల్ నోటీసులు

**'ఆదాబ్ హైదరాబాద్' పై పరువు నష్టం దావా వేసిన అలంపూర్ ప్రధాన అర్చకులు**









అలంపూర్, నవతరం: జర్నలిజం విలువలను వదిలేసి, వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న తీరుపై జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు ఆనంద్ శర్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై అసత్య కథనాన్ని ప్రచురించిన 'ఆదాబ్ హైదరాబాద్' పత్రికా యాజమాన్యం మరియు ఎడిటర్‌పై కఠిన చట్టపరమైన చర్యలకు ఆయన ఉపక్రమించారు. ఈ మేరకు ప్రముఖ హైకోర్టు న్యాయవాది ఆర్. చంద్రశేఖర్ రెడ్డి ద్వారా రూ.కోటి రూపాయల పరువు నష్టం దావా నోటీసులను పంపారు.

**అసలేం జరిగింది?**

ఏప్రిల్ 20వ తేదీన 'ఆదాబ్ హైదరాబాద్' పత్రికలో ప్రచురితమైన ఒక కథనం తీవ్ర కలకలం రేపింది. "మద్యం, డ్రగ్స్ కు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకున్న వ్యక్తిగా ప్రధాన అర్చకులు" అంటూ ఆనంద్ శర్మ పేరును, ఫోటోను ఆపాదిస్తూ ఆ పత్రిక కథనాన్ని వండి వార్చింది. వార్త లోపల మాత్రం జయంతి శ్రీనివాస్ శర్మ అనే వ్యక్తి గురించి ప్రస్తావించినప్పటికీ... మెయిన్ హెడ్డింగ్‌లో మాత్రం ఉద్దేశపూర్వకంగా ఆనంద్ శర్మ ఫోటోను వాడి ఆయన ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరించడం గమనార్హం.

ఈ తప్పుడు కథనంపై స్పందించిన ఆనంద్ శర్మ, పత్రికా యాజమాన్య వైఖరిని తీవ్రంగా తప్పుపడుతూ ఆయన ఈ విదంగా ప్రధానాంశాలను వ్యక్తపరిచారు.

స్క్రిప్ట్ జర్నలిజం: "ఎవరో రాసిచ్చిన తప్పుడు స్క్రిప్టును కనీస విచక్షణ లేకుండా, వాస్తవాలు తెలుసుకోకుండా ప్రచురించడం జర్నలిజం విలువలకు తిలోదకాలు ఇవ్వడమే."

**వివరణ కోరకపోవడం:**

"నా ఫోటో, నా పేరు వాడుతున్నప్పుడు కనీసం నా వివరణ తీసుకోవాలనే ప్రాథమిక సూత్రాన్ని కూడా పత్రిక పాటించలేదు."

మానసిక వేదన:"ఎటువంటి తప్పు చేయని నాపై, అత్యంత పవిత్రమైన స్థానంలో ఉన్న నాపై ఇటువంటి నీచమైన ఆరోపణలు చేయడం నన్ను, నా కుటుంబాన్ని తీవ్ర మానసిక వేదనకు గురిచేసింది."

న్యాయ పోరాటం: "అబద్ధపు వార్తలతో పబ్బం గడుపుకునే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కోర్టు ద్వారా న్యాయం తేల్చుకుంటాను. తక్షణమే స్పందించకుంటే రూ.కోటి రూపాయల పరువు నష్టం దావాకు సిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తున్నాను."

**న్యాయవాది స్పందన**

హైకోర్టు ప్రముఖ న్యాయవాది చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, ఒక వ్యక్తి గౌరవ మర్యాదలకు భంగం కలిగించే విధంగా, ఆధారాలు లేని వార్తలను ప్రచురించడం సివిల్ మరియు క్రిమినల్ నేరాల కిందకు వస్తుందని తెలిపారు. చట్టపరంగా ఈ అంశాన్ని తార్కిక ముగింపు వరకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

శతాబ్దాల చరిత్ర కలిగిన ఆలయ గౌరవానికి, అర్చక వ్యవస్థ ప్రతిష్టకు భంగం కలిగించిన సదరు పత్రికపై భక్తులు సైతం సోషల్ మీడియా వేదికగా మండిపడుతున్నారు. నిష్పాక్షికంగా ఉండాల్సిన పత్రికలు, వ్యక్తిగత కక్షల కోసం వేదికగా మారడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి అన్నారు.

# చిరు వ్యాపారుల పొట్టగొట్టడం అన్యాయం

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్**



కుత్బుల్లాపూర్, నవతరం: కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం 99 రోజుల పాలన పేరిట సైబరాబాద్ మునిసిపల్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాలలో పొట్టకూటి కోసం కిరాయిలు చెల్లించలేని వారు రోడ్డుపై వ్యాపారం చేసుకుంటూ ఉంటే సుందరీ కరణ పేరుతో చిరు వ్యాపారులను తొలగించడం అన్యాయమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ నేడు పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా పాలన అని చెప్పుతూ బుల్డోజర్ పాలన ను చేస్తున్నారని రేవంత్ రెడ్డి ప్రభుత్వనికి, ప్రభుత్వ అధికారులకు పేదలంటే అలుసుగా కనిపిస్తూ వారి కూడును, గూడును చెదరగొడుతున్నారని ఇవన్నీ రేవంత్ రెడ్డికి తెలిసే జరుగుతున్నాయా అని రేవంత్ రెడ్డి గారిని ప్రశ్నించడం జరిగింది. ఇలాంటి చర్యల వల్ల ప్రభుత్వానికి మంచి పేరు కంటే చెడ్డ పేరు వస్తుందని అధికారులు కూడా విచక్షణతో ఆలోచిస్తూ పేద ప్రజల పొట్ట కొట్టొద్దని అలాంటి చర్యలు నిరసిస్తూ కమ్యూనిస్టు పార్టీగా రానున్న రోజుల్లో చిరు వ్యాపారులందరినీ సమీకరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాల్సి వస్తుందని హెచ్చరించడం జరిగింది.

# వరుస దొంగతనాలకు పాల్పడుతున్న సమీర్ ఖాన్అరెస్ట్



కుత్బుల్లాపూర్, నవతరం: ?జగద్గిరిగుట్ట పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి పాత నేరస్థుడైన మొహమ్మద్ సమీర్ ఖాన్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడి నుండి రెండు ద్విచక్ర వాహనాలు (కేటీఎం, జూపిటర్), రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. జల్సాల కోసం దొంగతనాలకు అలవాటు పడ్డ ఇతనిపై గతంలోనూ పలు పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి.

# దస్తగిరి హత్యపై ప్రభుత్వం సీరియస్

**నిత్యానంద రెడ్డి కోసం పోలీసుల గాలింపు**

కడప,ఏప్రిల్21నగరంలో జరిగిన వైసీపీ కార్యకర్త పెద్దదస్తగిరి హత్య కేసుపై ప్రభుత్వం సీరియస్ అయింది. పోలీసులు లోతుగా విచారణ చేస్తూ కేసును అన్ని కోణాల నుంచి పరిశీలిస్తున్నారు. హత్య వెనుక ఉన్న కారణాలను బయటపెట్టడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. దస్తగిరి హత్యతో సంబంధం ఉన్న వైసీపీ నేత, మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. నిత్యానంద రెడ్డిని వీలైనంత త్వరగా అరెస్ట్ చేసి విచారించాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.హతుడు పెద్దదస్తగిరి ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో వైసీపీ నేతలకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 145 ఎకరాల భూములకు సంబంధించిన పత్రాలు ఉన్నాయి. ఈ భూముల మొత్తం విలువ 100 కోట్ల రూపాయలకు పైగా ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి నివాసంలో గత రాత్రి నాలుగు గంటల పాటు పోలీసులు తనిఖీలు చేపట్టారు. పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు చేపట్టిన విచారణతో వైసీపీ నేతల్లో టెన్షన్ నెలకొంది.


# అప్పుడు కెసిఆర్‌కు..ఇప్పుడు రేవంత్‌కు

- **ఎటిఎంలా మారిన కాళేశ్వరం ప్రాజెక్ట్**
- **రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ బండి విమర్శలు**

హైదరాబాద్,ఏప్రిల్21: కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన స్కామ్ రూ.లక్ష కోట్లా? రూ.9వేల కోట్లా? అని ప్రశ్నిం చారు. కేసీఆర్ కుటుంబంలో ఒక్కరిపై అయినా ప్రభుత్వం చర్యలు తీసు కుందా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళ`వారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ వ్యాఖ్యానించారు. కేసీఆర్, రేవంత్ భాషను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. గతంలో బీఆర్ఎస్‌కు.. ఇప్పుడు కాంగ్రెస్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కేంద్రానికి రేవంత్‌రెడ్డి రాసిన లేఖలో ఏముందని అడిగారు. రూ.9వేల కోట్ల అవినీతిపై దర్యాప్తు జరపాలని సీఎం రేవంత్ అంటున్నారని.. మరి లక్ష కోట్ల స్కామ్ గురించి ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు. రేవంత్ రాసిన లేఖలను కరపత్రాల రూపంలో ఇంటింటికీ పంచుతామన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ టూర్‌పై ఒక్కొక్కరూ ఒక్కోలా మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళలు ఉన్నతస్థాయికి వెళ్లాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళా బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు

. ఇందిరా, సోనియా, ప్రియాంక గాంధీకి పదవులు ఇస్తే మొత్తం మహిళలకు పదవులు వచ్చినట్టు భావిస్తున్నారన్నారు. విపక్షాల కుటుంబాల్లోని మహిళలకు పదవులు వస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగితే.. సీఎం రేవంత్ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్లేస్‌లో కూర్చోవాలని రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నారంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు.

# జూన్ 11న డ్రాగన్ మూవీ విడుదల




ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతోన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రానున్న డ్రాగన్ చిత్రం కొత్త విడుదల తేదీని నిర్మాణ సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయనున్నట్లు తెలిపింది. తుపాను తన లక్ష్యాన్ని కనుగొంది. 2027 జూన్ 11న థియేటర్‌లలో తుపాను రావడం ఖాయం అంటూ కొత్త విడుదల తేదీతో పాటు ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. మొదట ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ భావించారు. భారీస్థాయిలో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతుండడంతో దీన్ని ఈయేడాది జూన్ 25కు వాయిదా వేశారు. అయితే ఇంకా షూటింగ్ పూర్తికాకపోవడం.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు మిగిలిఉండడంతో ఇప్పుడు వచ్చే ఏడాదికి వాయిదా వేశారు. ప్రశాంత్ నీల్ మేకింగ్ విషయంలో ఎక్కడా రాజీపడకుండా దీన్ని రూపొందిస్తున్నారు. సినిమా ఆలస్యమైనా.. అభిమానులు కోరుకునేలా ఉండేలా చూస్తున్నారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. 'డ్రాగన్' అనే పేరు ప్రచారంలో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ తన లుక్ మార్చుకున్నారు. బరువు తగ్గి నాజూగ్గా కనిపిస్తున్నారు. ఇటీవల తన జిమ్ ఫొటో విడుదల చేయగా అది వైరల్ అయింది. దీంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# జైలర్-2 షూటింగ్ పార్ట పూర్తి



సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ గురించి తాజాగా కీలక అప్‌డేట్ వెలువడింది. చిత్ర బృందం అధికారికంగా షూటింగ్ పూర్తయిందని ప్రకటించడంతో, అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. షూటింగ్ పూర్తయిన సందర్భంగా చిత్ర యూనిట్ రజనీతో కలిసి కేక్ కట్ చేసి సెలబ్రేషన్స్ జరుపుకుంది. ఈ సందర్భంగా బయటకు వచ్చిన ఫోటోలు, వీడియోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి ప్రవేశించింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా పూర్తి చేస్తే, సినిమా అనుకున్న సమయానికి ముందే విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు చిత్ర బృందం అధికారిక విడుదల తేదీని ప్రకటించలేదు. దీంతో అభిమానులు రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో శివ రాజ్‌కుమార్, ఎస్.జే. సూర్య, మోహన్‌లాల్, రమ్య కృష్ణన్, మిర్నా మీనన్, యోగి బాబు వంటి పలువురు ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకులను అలరించనుంది. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా, సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. ఇప్పటికే ఆయన సంగీతం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. అయితే 'జైలర్ 2' షూటింగ్ పూర్తవడంతో, ఇప్పుడు అందరి దృష్టి పోస్ట్ ప్రొడక్షన్ పనులు మరియు రిలీజ్ డేట్‌పై ఉంది. రజనీకాంత్ స్టైల్, నెల్సన్ మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికలో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ప్యారడైజ్ కోసం రెండేళ్ల సమయం కేటాయింపు నటి కాయదు లోహర్

సంచలన నిర్ణయం
తెలుగు సినీ పరిశ్రమలో ఒకే సినిమాకు ఏళ్ల తరబడి సమయం కేటాయించడం అరుదైన విషయం. గతంలో బాహుబలి వంటి భారీ ప్రాజెక్ట్ కోసం అనుష్క శెట్టి తన కెరీర్‌లో ఐదు సంవత్సరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో యువ నటి కాయదు లోహర్ కూడా సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న 'ప్యారడైజ్' సినిమా కోసం కాయదు లోహర్ దాదాపు రెండేళ్లుగా మరే ఇతర ప్రాజెక్ట్‌కి కమిట్ కాకుండా పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే దృష్టి పెట్టింది. ఎదుగుతున్న హీరోయిన్ ఇలాంటివి నిర్ణయం తీసుకోవడం పెద్ద రిస్క్‌గా సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల కాయదు లోహర్ నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. అలాంటి సమయంలో కొత్త అవకాశాలను పక్కన పెట్టి ఒక్క ప్రాజెక్ట్‌పైనే ఆధారపడటం ఆమె కెరీర్‌కు సవాల్‌గా మారవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ 'ప్యారడైజ్' ఆశించిన స్థాయిలో హిట్ కాకపోతే, దాని ప్రభావం ఆమె భవిష్యత్తుపై పడే అవకాశముంది. అయితే ఈ సినిమాలో కాయదు పాత్ర కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, నటనకు మంచి స్కోప్ ఉన్నట్టుగా తెలుస్తోంది. భావోద్వేగపూరిత సన్నివేశాల్లో తన ప్రతిభను చూపించే మంచి ఛాన్స్ ఆమెకు దక్కిందని సమాచారం. ఇదే కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్‌కి అంత సమయం కేటాయించినట్లు తెలుస్తోంది. నాని వంటి ప్రతిభావంతుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం కూడా కాయదు కెరీర్‌కు ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా సక్సెస్ అయితే, కాయదు లోహర్‌కు పెద్ద బ్రేక్ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు పరిశ్రమలో వరుస సినిమాలు చేయడం కూడా నటీమణుల కెరీర్‌కు ముఖ్యమే. ఒకే ప్రాజెక్ట్‌పై ఎక్కువ కాలం ఆధారపడితే ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. గతంలో 'సైజ్ జీరో' కోసం అనుష్క తీసుకున్న రిస్క్ తర్వాత ఆమె కొంతకాలం గ్యాప్ తీసుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే.



# సన్నీతో ఇమ్రాన్ హష్మీ క్లాష్..

## 19 ఏళ్ల క్రితం నాటి పగ తీర్చుకుంటాడా?




చాఝుతీుజాఝిఅ 2। ఈ ఏడాది ఇండిపెండెన్స్ డే వీకెండ్ బాక్సాఫీస్ భారీ యుద్ధానికి వేదిక కాబోతోంది. బాలీవుడ్ అగ్ర హీరోలు సన్నీ డియోల్, ఇమ్రాన్ హష్మీ తమ మోస్ట్ అవేటెడ్ చిత్రాలతో వుుఖావుుఖి తలవడబోతున్నారు. ఇమ్రాన్ హష్మీ కెరీర్‌లో క్లాసిక్‌గా నిలిచిన 'ఆవారాపన్'కు సీక్వెల్‌గా వస్తున్న "ఆవారాపన్ 2" ఆగస్టు 14, 2026న విడుదల కానున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. దిశా పటానీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని నితిన్ కక్కర్ దర్శకత్వంలో విశేష్ భట్ నిర్మిస్తున్నారు. ఇదే సమయంలో బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో సన్నీ డియోల్ నటిస్తున్న భారీ పీరియడ్ డ్రామా "లాహోర్ 1947" కూడా స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా థియేటర్లలోకి రానుంది. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి.అయితే ఈ రెండు సినిమాలకు అంత హైప్ ఎందుకంటే.. సరిగ్గా 19 ఏళ్ల క్రితం 2007లో సన్నీ డియోల్ 'అప్నే', ఇమ్రాన్ హష్మీ 'ఆవారాపన్' చిత్రాలు ఒకే రోజు విడుదలై బాక్సాఫీస్ వద్ద పోటీ పడ్డాయి. ఇందులో 'ఆవారాపన్' బాక్సాఫీస్ వద్ద నిరాశపరచగా.. సన్నీ డియోల్ 'అప్నే' మాత్రం మంచి వసూళ్లను సాధించింది. అయితే ఇప్పుడు మళ్లీ అదే తరహా క్లాష్ పునరావృతం కావడం సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. 'లాహోర్ 1947' దేశభక్తి పూరిత యాక్షన్ డ్రామాగా వస్తుండగా, 'ఆవారాపన్ 2' ఇంటెన్స్ మ్యూజికల్ లవ్ స్టోరీగా అలరించబోతోంది. ఇండిపెండెన్స్ బాక్సాఫీస్ పోరులో విజేతగా ఎవరు నిలుస్తారో అని అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

# బాలయ్య సినిమా నుండి నయనతార ఔట్ ..NBK 111'లో కాజల్ ఎంట్రీకి రంగం సిద్ధం?

నందమూరి నటసింహం బాలకృష్ణ ప్రస్తుతం తన కెరీర్‌లో గోల్డెన్ ఫేజ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. అఖండ , వీరసింహారెడ్డి , భగవంత్ కేసరి వంటి వరుస విజయాలతో ఆయన స్టార్‌డమ్ మరింత పెరిగింది. ఈ వయసులో కూడా యంగ్ హీరోలకు పోటీగా వరుస సినిమాలను లైన్‌లో పెట్టడం బాలయ్య ప్రత్యేకతగా మారింది. ఇలాంటి సమయంలోనే మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేనితో బాలకృష్ణ మరోసారి జతకట్టడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన "వీరసింహారెడ్డి" భారీ విజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే జోష్‌తో "చీదీఖ 111" పేరుతో మరో ప్రాజెక్ట్ తెరకెక్కుతోంది. ఈ చిత్రం పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్. 1960-70ల కాలంలోని ముంబై నేపథ్యంతో పాటు చారిత్రక అంశాలను మేళవిస్తూ దర్శకుడు పవర్‌ఫుల్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు తమన్ మరోసారి బాలయ్య సినిమాకు సంగీతం అందించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ ఎంపిక ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# శివాజీ చరిత్ర ఆధారంగా రాజా శివాజీ

మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరగాథను వెండితెరపై ఆవిష్కరిస్తూ రితేష్ దేశ్‌ముఖ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'రాజా శివాజీ' చిత్రం ప్రస్తుతం దేశవ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ చారిత్రక చిత్రానికి రితేష్ దేశ్‌ముఖ్ స్వయంగా దర్శకత్వం వహిస్తుండగా, ఆయన భార్య జెనీలియా దేశ్‌ముఖ్ తన సొంత నిర్మాణ సంస్థ ముంబై ఫిల్మ్ కంపెనీ మరియు జియో స్టూడియోస్ భాగస్వామ్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే భారీ విజువల్స్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ఒక కీలకమైన ప్రతినాయక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. శివాజీ మహారాజ్ స్వరాజ్యం కోసం చేసిన పోరాటాన్ని, ఆయన సాహసాలను ఎంతో గ్రాండ్‌గా చూపించబోతున్న ఈ సినిమాను మరాఠీ మరియు హిందీ భాషల్లో ప్రధానంగా రూపొందించారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. గతంలో 'వేద్' వంటి భారీ విజయాలను అందుకున్న రితేష్-జెనీలియా కాంబో ఈ చారిత్రక చిత్రంతో మరోసారి బాక్సాఫీస్ వద్ద తమ సత్తా చాటడానికి సిద్ధమవుతున్నారు




Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com